క్లుప్తంగా

దాతల సహకారంతో స్కూల్లో సైకిల్ షెడ్డు నిర్మాణం



పాఠశాలలో సైకిల్ షెడ్డును ప్రారంభిస్తున్న బూరుగుపల్లి సుబ్బారావు

ఉండ్రాజవరం: స్థానిక నంబర్–1 ప్రాథమిక పాఠశాలలో దాతల విరాళాలు రూ.మూడు లక్షల వ్యయంతో నిర్మించిన ఆట స్థలం, సైకిల్ షెడ్డును శుక్రవారం జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు ప్రారంభించారు. శ్రీ సత్యనారాయణ స్పిన్నింగ్ మిల్స్ లిమిటెడ్ యాజమాన్యం, మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ ఈ.సత్య నారాయణ ఆర్థిక సహకారంతో ఈ నిర్మాణాలు జరిపారు. కార్యక్రమంలో ఎంఈఓ పీవీఎస్ నాగరాజు, విద్యాక మిటీ చైర్మన్ తోరాటి బాలాజీ, సత్యనారాయణ స్పిన్నింగ్ మిల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో రక్తహీనత లోపం



విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్య,ఆరోగ్యశాఖ సిబ్బంది

నల్లజర్ల: జంక్ ఫుడ్‌కు అలవాటు పడిన బాలబాలికలు పోషకాహారంపై దృష్టి పెట్టకపోవడంతో, వారిలో రక్త హీనత ఏర్పడుతుందని వైద్యులు నిర్ధారించారు. రక్తహీనత లోపించిన ఎక్కువ శాతం బాలికల్లో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని నల్లజర్ల పీహెచ్‌సీ డాక్టర్ మహమ్మద్ సిరాజుద్దీన్ అన్నారు. నల్లజర్లలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం ఆయన పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు యూపీ, ఐదు జెడ్పీ హైస్కూళ్లు, ఒక జూనియర్ కళాశాలలకు చెందిన 104 మంది విద్యార్థులు రక్తహీనతతో బాధపడుతున్నారని, 542 మంది మధ్యస్థంగా ఉన్నట్టు గుర్తించామన్నారు. ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల ఎత్తు, బరువు, హిమోగ్లోబిన్ (హెచ్‌బీ) వినికిడి, కంటి సమస్యలను నమోదు చేస్తున్నట్టు చెప్పారు. నమోదు చేసిన వారి వివరాలను యాప్‌లో పొందుపరుస్తున్నామన్నారు.

కోడ్ అమలుతో ఫ్లెక్సీల తొలగింపు



తొలగించిన ఫ్లెక్సీలను మునిసిపల్ ట్రాక్టర్‌పై తరలిస్తున్న సిబ్బంది

కొవ్వూరు: స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో కొవ్వూరు పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన వివిధ రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను శుక్రవారం మునిసిపల్ సిబ్బంది తొలగించారు. తొలగించిన ఫ్లెక్సీలను ట్రాక్టర్లపై మునిసిపల్ కార్యాలయానికి తరలించారు.మార్చి 16 వరకూ ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని అధికారులు చెబుతున్నారు. కోడ్ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ నిర్వహిస్తున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి, టీడీపీ నిర్వహిస్తున్న ఇదేం ఖర్మ వంటి కార్యక్రమాలకు కూడా బ్రేక్ పడింది.

బాల్య వివాహాలపై తల్లులకు అవగాహన

దేవరపల్లి: బాల్య వివాహాల వల్ల అనర్థాలు వస్తాయని, 18 ఏళ్ల పైబడిన తర్వాతే యువతులకు వివాహాలు జరిపించాలని ఐసీడీఎస్ సీడీపీఓ వైబీటీ సుందరి తల్లులకు సూచించారు. మండలంలోని చిన్నాయగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని పిల్లల తల్లులకు శుక్రవారం బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీడీపీఓ సుందరి మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు బాలికలకు వివాహాలు చేయరాదన్నారు. బాల్య వివాహం జరిగితే బాలిక మానసికంగా, శారీరకంగా ఎదుగుదల ఉండదని ఆమె తెలిపారు. సదస్సులో సర్పంచ్ డెక్కపాటి జ్యోతిరాణి, యాదవోలు సెక్టార్ సూపర్వైజర్ బి.విజయ శాంతి, ఎంపీటీసీ సభ్యురాలు మరపట్ల నాగ మణి, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యురాలు అస్మత్ ఉన్నీషా బేగం, అంగన్‌వాడీ వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వెల్డర్ మృతి

దేవరపల్లి: గాయపడిన మరపట్ల సతీష్ (36) అనే వెల్డర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పెంటపాడు మండలం అలంపురానికి చెందిన సతీష్ దేవరపల్లి శివార్లలోని ఓ పరిశ్రమలో సివిల్ వర్క్స్ కాంట్రాక్టర్ వద్ద వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. సతీష్ గురువారం విధుల్లో ఉండగా ప్రమాదవశాత్తూ నిచ్చెనపై నుంచి జారి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం సతీష్‌ను కాంట్రాక్టర్ రాజమహేంద్రవరంలోని బొల్లినేని ఆసుపత్రికి తరలించారు. తర్వాత అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం జీజీహెచ్‌కి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు శుక్రవారం సాయంత్రం దేవరపల్లి ఎస్సై కె. శ్రీహరిరావు తెలిపారు.

నిమ్మ పుల్లన... ధర తియ్యన

- రూ.43కు పెరిగిన కిలో కాయలు
- యాదవోలు మార్కెట్లో రైతుల సందడి



యాదవోలు మార్కెట్లో వ్యాపారులు కొనుగోలు చేసిన నిమ్మకాయలు



దేవరపల్లిలో సాగులో ఉన్న నిమ్మతోట

దేవరపల్లి: నిమ్మకాయల మార్కెట్ ఇప్పుడిప్పుడే పుంజుకుంటోంది. నిన్నమొన్నటి వరకూ కాయలకు ధర లేక రైతులు ఇబ్బంది పడ్డారు. జనవరిలో కిలో నిమ్మకాయలు రూ.22 నుంచి 28 ధర మాత్రమే పలికాయి. ఇప్పుడా రేటు రూ.43 కు పెరిగింది. ఈ నెలాఖరుకు ధర మరింత పెరుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఏలూరు తర్వాత మండలంలోని యాదవోలుకు నిమ్మకాయల మార్కెట్‌కు గుర్తింపు ఉంది. రోజూ సీజన్‌లో 1000 నుంచి 1200 బస్తాల నిమ్మకాయలు రైతులు యాదవోలు మార్కెట్‌కు తీసుకు వస్తారు. సాయంత్రం ఐదు నుంచి రాత్రి 10 గంటల వరకూ ఈ మార్కెట్ జరుగుతుంది. సీజన్‌లో మార్కెట్ రైతులతో కళకళలాడుతుంది. ప్రస్తుతం రోజుకు 400 బస్తాల నిమ్మకాయలు మార్కెట్‌కు వస్తున్నట్టు వ్యాపారులు తెలిపారు. యాదవోలులో సుమారు 500 మంది రైతులు దాదాపు 2,000 ఎకరాల్లో నిమ్మ తోటలను సాగు చేస్తున్నారు. ఫిబ్రవరి నుంచి జూన్ వరకూ నిమ్మకాయల సీజన్ రద్దీగా ఉంటుంది. ఈ సీజన్‌లో నిమ్మకాయలకు డిమాండ్ ఉంటుంది. సీజన్ నాలుగు నెలల్లో రైతులకు మంచి ఆదాయం వస్తుంది. ఎక్కువ మంది రైతులు తోటలను కౌలుకు తీసుకుని పంటను పండిస్తున్నారు. తోటను బట్టి ఎకరానికి కౌలు రూ.80 వేల నుంచి రూ. లక్ష వరకూ ఉంటుంది. ధర బాగున్నప్పటికీ ఆశించిన దిగుబడులు లేక ఆదాయం కోల్పోతున్నట్టు రైతులు వివరించారు. గతేడాది 50 కిలోల బస్తాకు రూ.200 రేటు పలికిందన్నారు. బస్తా కాయలు కోయడానికి కూలీలకు రూ.300 ఖర్చయినట్టు రైతులు వివరించారు. యాదవోలులో ప్రధాన పంటగా నిమ్మ సాగు చేస్తున్నారు. ఒక విధంగా చెప్పాలంటే నిమ్మ పంట రైతులకు పాడి కుండ వంటిది. ఏరోజు కాయలకు ఆరోజు మార్కెట్లో చేతిలో డబ్బులు పడతాయి. సాయంత్రం వరకూ తోటల్లో కోసిన కాయలను సాయంత్రం మార్కెట్‌కు తీసుకువచ్చి అమ్ముకుంటారు. గోపాలపురం, కొయ్యలగూడెం, దేవరపల్లి మండలాల నుంచి రైతులు యాదవోలు మార్కెట్‌కు కాయలు తీసుకు వచ్చి అమ్ముతారు.

రైతులే ఎగుమతి దారులు

యాదవోలు మార్కెట్లో ఎటువంటి దళారీ వ్యవస్థ ఉండదు. రైతులే సంఘంగా ఏర్పడి రైతుల నుంచి కమీషన్ తీసుకోకుండా కొనుగోలు చేసి ఎగుమతి చేస్తారు. ఇక్కడ నుంచి విశాఖ, రాజమహేంద్రవరం, విజయనగరాలతో పాటు ఒడిశా, కోల్‌కత్తా వంటి ఇతర ప్రాంతాలకు కూడా ఎగుమతి జరుగుతుంది. జాతీయ రహదారులు అభివృద్ధి చెందడంతో ఎక్కువగా పంటను కోల్‌కత్తాకు ఎగుమతి చేస్తున్నారు. రాష్ట్రంలో గూడూరు మార్కెట్ పెద్ద నిమ్మకాయల మార్కెట్. గతేడాది గూడూరు మార్కెట్‌కు ఎక్కువ కాయలు రావడం, పంట దిగుబడులు పెరగడంతో రైతులకు గిట్టుబాటు ధర లభించిందని రైతులు వివరించారు. గూడూరు మార్కెట్‌కు కూడా యాదవోలు, ఏలూరు మార్కెట్ల నుంచి నిమ్మకాయలు ఎగుమతి చేస్తారు.

మార్కెట్ పుంజుకుంటుంది



నిమ్మకాయల మార్కెట్ పుంజుకుంటుంది. జనవరిలో కిలో కాయలు రూ.22 నుంచి 28 ఉండగా, ప్రస్తుతం రూ.43 పలుకుతోంది. మార్చి నెలలో ధర ఇంకా పెరుగుతుంది. గతేడాది కిలో రూ.200 ధర పలకడం వల్ల రైతులు ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. యాపిల్ ధరతో సమానంగా నిమ్మకాయల ధర పలికింది. ఆ ఏడాది కూడా అదే ధర పలికితేనే రైతుకు గిట్టుబాటు అవుతుంది. వర్షాలకు నిమ్మచెట్టు ఊటేసి చనిపోయి పూతలు దెబ్బతిన్నాయి. దీనివల్ల దిగుబడి తగ్గుతుంది. పూతలు బాగుంటే ఎకరాకు 80 నుంచి 100 బస్తాలు (బస్తాకు 50 కిలోలు) దిగుబడి వస్తాయి. ఈ ఏడాది 40 నుంచి 50 బస్తాలు వచ్చే పరిస్థితి ఉంది. ఎరువుల రేటు, కూలీల ఖర్చులు పెరిగాయి.

– అనిశెట్టి సూర్యచంద్రరావు, రైతు, యాదవోలు

చేసిన మేలునే ఇంటింటికీ వెళ్లి చెప్పండి

- ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు
- సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు అవగాహన సదస్సు
- హాజరైన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు చీర్ల రాధయ్య



సమావేశానికి హాజరైన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు. చిత్రంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు చీర్ల రాధయ్య తదితరులు

నిడదవోలు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు చేకూరిన లబ్ధిని ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. నిడదవోలు మండల స్థాయి గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్ల అవగాహన సదస్సు శుక్రవారం పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో నిర్వహించారు. వారు నిర్వర్తించాల్సిన విధులపై ముందుగా ఎల్ఈడీ తెరపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీ కుటుంబంలా సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సేవలో సీఎం జగన్‌కు అండగా నిలవాలన్నారు. టీడీపీ నాయకుల కుటుంబాలకు కూడా సీఎం జగన్ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పార్టీలకతీతంగా ప్రజలకు మేలు చేకూరుస్తున్నారన్నారు. ఈ నెల 20 నుంచి 27 వరకూ నిర్వహించే జగనన్నే మా భవిష్యత్తు (జేఎంబీ) కార్యక్రమాన్ని అన్ని సచివాలయల్లో సమష్టిగా విజయవంతం చేయాలన్నారు.

ముఖ్యమంత్రి ప్రతినిధులు మీరే ..

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతినిధులుగా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని వైఎస్సార్ సీపీ నిడదవోలు నియోజకవర్గ పరిశీలకుడు చీర్ల రాధయ్య అన్నారు. గతంలో జన్మభూమి కమిటీల పెత్తనంలో ఎందరో అర్హులకు కూడా సంక్షేమ పథకాల్లో కొర్రీ పేట్టేవారని గుర్తు చేశారు. మళ్ళీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అయినీడి పల్లారావు, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, మండల కన్వీనర్ల ఇన్‌చార్జి వెలగన పోలయ్య, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కాలాబత్తుల సుజాత, నియోజకవర్గ సర్పంచుల ప్రతినిధి తిక్కా శ్రీనివాస్, కాపకాయల సూర్యనారాయణ, సొసైటీల అధ్యక్షులు పెన్మత్స చందు, గజ్జరపు రమేష్, కస్తూరి సాగర్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

నేటి నుంచి జాగృతి ఉద్యమం



నల్లజర్లలో జాగృతి ఉద్యమ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న జామాతే ఇస్లామీ హింద్ సభ్యులు

నల్లజర్ల: సామాజిక, ఆధ్యాత్మిక సంస్థ జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి 20 వరకూ మానవత–నైతికత నినాదంతో జాగృతి ఉద్యమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆ సంస్థ పూర్వపు పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే సలీం తెలిపారు. ఈ కార్యక్రమం కరపత్రాన్ని శుక్రవారం అయన నల్లజర్లలోని మీనార్ మసీదులో విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఆధునిక మానవుడు వైజ్ఞానికంగా దూసుకుపోతున్నప్పటికీ మానవతా విలువలు దిగజారిపోతున్నాడన్నారు.నేటి సమాజంలో పెరిగిపోతున్న నేరాలు, మారణ హోమాలే ఇందుకు కారణాలన్నారు. నైతిక పరివర్తన కలిగినప్పుడే మానవతా విలువలు వికసిస్తాయన్నారు. సమాజంలో ఈ భావనను పెంపొందించే ఉద్దేశంతోనే జాగృతి ఉద్యమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జమాతే ఇస్లామీ హింద్ నల్లజర్ల శాఖ అధ్యక్షుడు ఎండీ ఇలియాస్ షరీఫ్ మాట్లాడుతూ జాగృతి ఉద్యమంలో భాగంగా సామాజిక, రాజకీయ, వివిధ రంగాల ప్రముఖలతో సమావేశాలు, వివిధ మతాల ఆధ్యాత్మిక గురువులతో చర్చాగోష్ఠులు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో మసీదు అధ్యక్షులు ఎస్‌కేరఫీ, ఎస్‌కే సుభానీ,ఎస్‌కే మహబూల్‌ఆలీ, లెక్చరర్ ఎస్‌కే అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

దొరసానిపాడులో మద్దిపాటికి చుక్కెదురు



టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరావును అడ్డుకున్న దొరసానిపాడు గ్రామస్తులు

ద్వారకాతిరుమల: మండలంలోని దొరసానిపాడు గ్రామస్తులు శుక్రవారం రాత్రి టీడీపీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకటరాజును అడ్డుకున్నారు. వివరాల ప్రకారం, టీడీపీ నాయకులు ఈ గ్రామంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం చేపట్టారు.ఇందులో భాగంగా మద్దిపాటి వెంకటరాజు పార్టీ నేతలతో కలసి గ్రామంలో పర్యటిస్తుండగా పలువురు గ్రామస్తులు, పెద్ద ఎత్తున మహిళలు వారిని అడ్డుకున్నారు. దాంతో ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వం అందించే ఇళ్ల స్థలాలను తమకు అందనివ్వకుండా చేసి, వాటిని కోర్టు వివాదాల్లోకి నెట్టింది టీడీపీ నాయకులేనని గ్రామస్తులు ధ్వజమెత్తారు. ఇప్పుడు ఏమీ తెలియనట్టు వచ్చి కల్లబొల్లి మాటలు చెబితే నమ్మడానికి తాము సిద్ధంగా లేమన్నారు. ఇళ్ల స్థలాల పంపిణీని అడ్డుకున్న నాయకులతో కలసి ఏ కార్యక్రమాన్ని చేపట్టినా ఫలితం ఇలానే ఉంటుందని మద్దిపాటిని వారు హెచ్చరించారు. మా గ్రామానికి పట్టిన నిజమైన ఖర్మ ఇళ్ల స్థలాల పంపిణీని అడ్డుకున్న టీడీపీ నాయకులే అన్నారు. అయితే ఆందోళనకారులకు నచ్చజెప్పేందుకు టీడీపీ నాయకులు ఎంత ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. దాంతో చివరకు వారు అక్కడి నుంచి నెమ్మదిగా జారుకున్నారు.

ఉండ్రాజవరంలో గండిపోశమ్మ విగ్రహ ప్రతిష్ఠ



గండి పోశమ్మ వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు

ఉండ్రాజవరం: స్థానిక కొత్తపేటలో నూతనంగా నిర్మించిన గండిపోశమ్మ వారి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ముక్తేశ్వరానికి చెందిన టీటీడీ వేద పండితుడు బ్రహ్మశ్రీ అల్లవరపు సుబ్రహ్మణ్య దీక్షితుల ఆధ్వర్యంలో పలువురు వేద ఆగమ పండితులచే గణపతి పూజ, పీఠపూజ, యంత్ర, విగ్రహ, లింగ, శిఖర ప్రతిష్ఠ , శాంతి కల్యాణం , కుంభాభిషేకం, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. నిడదవోలు ఎమ్మెల్యే జి. శ్రీనివాస్ నాయుడు గండి పోశమ్మ వారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద నిర్వహించిన అన్నసమారాధనలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, గండిపోశమ్మ అమ్మవారి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరిక



టీడీపీ నాయకులకు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు

నిడదవోలు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులైన టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. స్థానిక లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మండలంలో కోరుపల్లి గ్రామానికి చెందిన టీడీపీ బీసీ నాయకుడు కారింకి సత్యనారాయణతో పాటు 25 మంది ఆ పార్టీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు ,వారందరికీ పార్టీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీలో చేరిన వారందరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఇకపై వారంతా వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులను, ఎవరికి ఏ అవసరం వచ్చిన తానున్నానంటూ ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. పార్టీలోకి చేరిన కారింకి సత్యనారాయణ మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా టీడీపీలో ఉన్నా కనీస గుర్తింపు లేదన్నారు.కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకు చీర్ల రాధయ్య, పార్టీ మండలశాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, ఏఎంసీ చైర్మన్ వెలగన పోలయ్య, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, ఎంపీపీ తిరమళ్ళ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నిర్మూలన తప్పనిసరి

- జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు
- రైతులకు ఎలుకల నివారణ మందు పంపిణీ



నల్లజర్లలో ఎలుకల నిర్మూలన ఎర తయారు చేస్తున్న వ్యవసాయ సహాయకులు



సమిశ్రగూడెంలో రైతులకు ఎలుకల మందు పంపిణీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

నిడదవోలు రూరల్: రైతులందరూ సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు సూచించారు. బ్రోమోడయోలిన్ మందు, నూకలు, నూనెతో కలిపిన ఎలుకల నివారణ ఎర పొట్లాలను మండలంలోని సమిశ్రగూడెం రైతుభరోసా కేంద్రం వద్ద రైతులకు శుక్రవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ ఎలుకల వల్ల పంట నష్టం ఎక్కువగా ఉంటుందన్నారు. వ్యవసాయరంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రైతులు సాంకేతిక పరిజ్ఞానం అలవరుచుకోవాలన్నారు. రబీకి సంబంధించి త్వరలోనే ఆర్‌బీకేల పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఎలుకల మందు తయారీ, పొలాల్లోని బొరియల్లో పెట్టే విధానంపై ఆయన వివరించారు. కార్యక్రమంలో డీడీఏ బోస్ బాబు, ఏవో జి.సత్యనారాయణ, అగ్రికల్చరల్ అసిస్టెంట్లు కె.శివనాగు, మాధవన్, రైతులు కస్తూరి కోటి తదితదిరులు పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నిర్మూలనకు ఎర పంపిణీ

నల్లజర్ల: మండలంలో వరి సాగు చేసే 2,200 హెక్టార్ల విస్తీర్ణంలోని పొలాల్లో శుక్రవారం సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపట్టినట్టు వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్ తెలిపారు. మండలంలోని 19 రైతు భరోసా కేంద్రాల ద్వారా 19.5 కిలోల బ్రోమోడయలిన్ మందును పంపిణీ చేశామన్నారు. 96 శాతం నూకలు, 2 శాతం నూనె, 2 శాతం బ్రోమోడయలిన్ మందును కలిపి ఎకరానికి 20 పొట్లాల చొప్పున రైతులకు అందించినట్టు ఏవో వివరించారు. ప్రస్తుతం వరి పైరు చిరు పొట్ట దశలో ఉందని, ఈ దశలోనే ఎలుకలు 35 శాతం పంటకు నష్టం కలుగజేస్తాయని రైతులు గుర్తించాలన్నారు. రైతులంతా సామూహికంగా ఈ కార్యక్రమం చేపట్టడం ద్వారా నిర్మూలించవచ్చునన్నారు. గ్రామాల్లోని ఖాళీ ప్రదేశాలు, ప్రభుత్వ పోరంబోకు స్థలాల్లో కూడా ఎలుకల నిర్మూలన చేపట్టేలా గ్రామ సచివాలయాలకు ఈ మందును అందించనున్నట్టు చెప్పారు.

ఉండ్రాజవరం: రైతులందరూ సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపట్టి వరి పంటను కాపాడుకోవాలని ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు సూచించారు. మండలంలోని పాలంగి, ఉండ్రాజవరాల్లో వారిద్దరి ఆధ్వర్యంలోను, మండలంలో అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద శుక్రవారం ఆయా పంచాయతీ సర్పంచుల ఆధ్వర్యంలోనూ రైతులకు ఉచితంగా ఎలుకల నివారణ మందును ఆందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎ.శ్రీనివాసు, ఏవో మీసాల విశ్వాసరావు, గ్రామ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

బంధువుల ఇంటికి వచ్చి.. గోదావరిలో శవమై తేలి..

కొవ్వూరు: చాగల్లు మండలం కలవలపల్లికి చెందిన మద్దుకూరి జయకిషోర్ (41) గోదావరి నదిలో పడి దుర్మరణం పాలయ్యారు. కొవ్వూరు ఇందిరమ్మ కాలనీలో ఉంటున్న వరుసకు బావ అయిన ఉప్పులూరి వరప్రసాద్ ఇంటికి శుక్రవారం జయకిషోర్ వచ్చారు. బహిర్భూమికి వెళ్లి వస్తానని చెప్పి బయటకు వెళ్లాడు.ఎంతకీ రాకపోవడంతో వరప్రసాద్ వెతుకులాడగా జయకిషోర్ మోటారు సైకిల్, అతడు వేసుకుని వచ్చి చెప్పులు గోదావరి నది ఒడ్డున కనిపించారు.లాంచీల రేవు సమీపంలో గోదావరి నదిలో మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించినట్లు పట్టణ సీఐ ఏఎల్ఎస్ రవికుమార్ తెలిపారు. వరప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.జయకిషోర్ మృతికి దారితీసిన పరిస్థితుల ఏమిటనేదానిపై విచారణ చేస్తున్నామన్నారు. అతడి కుటుంబ సభ్యులు వస్తే పూర్తి వివరాలు తెలిసే అవకాశం ఉందన్నారు.

టీచర్‌పై వచ్చిన అభియోగాలపై విచారణ

చాగల్లు: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అందించాలని తాడేపల్లిగూడెం డీవైఈవో ఎం.రవీంద్ర భారతి సూచించారు. చాగల్లు ప్రాథమిక పాఠశాలను ఆమె శుక్రవారం సందర్శించారు. ఇటీవల ఈ పాఠశాల ఉపాధ్యాయుడు సీహెచ్ రాంబాబుపై వచ్చిన అభియోగాలపై డీవైఈవో విచారణ జరిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి, ఎంపీటీసీ సభ్యుడు సానబోయిన అర్జునుడు, ఎంఈవోలు వి.ఖాదర్‌బాబు, ఎం. మంగాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

మలకపల్లిలో ఫ్రై డే డ్రై డే



ఫ్రైడే డ్రై డే ర్యాలీలో డీఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు తదితరులు

తాళ్లపూడి: ఇంటి పరిసరాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా ప్రజలు జాగ్రత్తలు తీసు కోవాలని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. మలకపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆ గ్రామంలో నిర్వహించిన ఫ్రై డే డ్రైడే కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో పాల్గొన్నారు. అనంతరం వైద్య సిబ్బందితో ఆయన సమీక్ష జరిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాదేశాల మేరకు ఈ నెల 14న హెల్త్ అండ్ వెల్ నెస్ సెంటర్లలో సైకిల్ ఫర్ హెల్త్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ఐ. మైఖేల్ ప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

దేవరపల్లి: ప్రభుత్వాసుపత్రుల్లో గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు వైద్య సిబ్బందికి సూచించారు.గౌరీపట్నం పీహెచ్‌సీని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, రికార్డులు, ప్రసవాలు ఎన్ని జరుగుతున్నాయి? ప్రజలకు అందిస్తున్న సేవలు, మందుల నిల్వలు, రక్త పరీక్షలు, తదితర సేవల వివరాలను పరిశీలించారు. వైద్యులు, సిబ్బందికి తగు ఆదేశాలు ఇచ్చారు. కాన్పులు పెంచాలని, ప్రమాదకర గర్భిణులను సకాలంలో గుర్తించి మెరుగైన వైద్య సేవలను అందించాలన్నారు.

లంపీ స్కిన్ వ్యాధితో పశువులకు ప్రమాదం

నల్లజర్ల: కాప్రి పాక్స్ అనే వైరస్ ద్వారా పశువులకు వచ్చే లంపీ స్కిన్ డిసీజ్ విషయంలో పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ నల్లజర్ల అసిస్టెంట్ డైరెక్టర్ జాన్ మోజెష్ వెస్లీ సూచించారు. నల్లజర్ల రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం రైతు సలహా మండలి సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఏడీఏ మాట్లాడుతూ ఈ వ్యాధి సోకకుండా రైతులు తమ పశువులకు ముందస్తుగా వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు. ప్రతి రైతుభరోసా కేంద్రంలోను ఈ వ్యాక్సిన్ అందుబాటులో ఉందన్నారు. తెల్లని పశువుల్లో ఈ వ్యాధి వచ్చే అవకాశాలు ఎక్కువన్నారు. నిర్లక్ష్యం చేస్తే శ్వాస తీసుకోలేక పశువులు మృత్యువాత పడతాయన్నారు. ఏవో కమల్‌రాజ్ మాట్లాడుతూ అన్ని ఎరువుల విక్రయాలకు వలంటీర్, బ్యాంకు సేవలు అందించేందుకు బ్యాంకు మిత్రలను రైతు భరోసా కేంద్రాల్లో నియమించాలని ప్రభుత్వానికి విన్నవించారు. ఈక్రాప్ నమోదుకు రైతులు రసీదు తీసుకోవాలన్నారు.

నేడు జాతీయ మెగా లోక్ అదాలత్

కొవ్వూరు: సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు శనివారం నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగ పరుచుకోవాలని జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి పి.అన్నపూర్ణ కోరారు. లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవడం ద్వారా ఖర్చులు, సమయం ఆదా చేసుకోవచ్చని ఆమె సూచించారు. ఇరు పక్షాలు రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరి ంచుకోవడానికి లోక్ అదాలత్ ఉపకరిస్తుందని సూచించారు